# సూత్రధారికి ఓ పాత్ర

"ఏమిటి విక్రమ్, ఇలా వచ్చేవ్? డబ్బేమైనా కావాలా?" అని అడిగేడు ఆర్మీ డాక్టర్ పరాంకుశం.

మేజర్ విక్రమ్ ఇబ్బందిగా కదిలేడు కుర్చీలో. "అబ్బే డబ్బు ఎందుకు? డబ్బక్కరలేదు కానీ, మళ్లీ డ్యూటీలో జాయినవుదామనుకుంటున్నాను." అన్నాడు నెమ్మదిగా.

పరాంకుశం అతనికేసి దీర్ఘంగా చూసాడు. "లుక్ విక్రమ్, నీకు ఆనాడే చెప్పాను. హాయిగా ఉద్యోగం చేసుకోవయ్యా, నిన్ను అడిగేవాడూ, నీ జోలికి వచ్చేవాడూ ఎవడూ లేడు అని. విన్నావా? లేదు. 'ఎంత సంపాదించి ఏం లాభం? పిల్లలతో హాయిగా అనుభవించకపోతే వేస్టు' అంటూ పరుగులు పెట్టావ్..."

"వాలంటరీ రిటైర్‌మెంటు స్కీము వస్తోందంటున్నారు కాబట్టి అది ఉపయోగించుకుందామనుకున్నాను."

"అప్పుడూ ఇలాగే చెప్పావు కాబట్టి నువ్వు సిక్ అని సర్టిఫికెట్టు ఇచ్చాను. నీకు తెలియదు నేనెంత అవస్థ పడ్డానో. మామూలు ఉద్యోగాలు కాదు కదా, ఆర్మీలో దొంగ సర్టిఫికెట్టు అంటే చచ్చేటంత కష్టం. టీము టీమంతటినీ మేనేజ్ చేయాల్సి వచ్చింది. ఫ్రెండుని కదా, కాదనలేక ఆ చికాకులన్నీ పడ్డాను."

"నేనొప్పుకుంటాను. ఆవేళ ఎంతో బతిమాలేవు. బంగారుగుడ్లు పెట్టే బాతు లాటి ఉద్యోగాన్ని వదులుకోవద్దని. కానీ నేను మొండికేయడంతో పోనీ కదాని నువ్వే సహాయం చేసావు." అన్నాడు విక్రమ్ తలదించుకుని.

డాక్టర్ పరాంకుశం విక్రమ్ భుజం తట్టాడు. "ఫర్‌గెటిటిట్, మై బోయ్! స్నేహితులన్నాక ఇలాటివి మామూలే. నేను నీకు ఉపకారం చేయకా తప్పదు, నువ్వు నాకు చేయకా తప్పదు. నేను మాత్రం నీ వల్ల లబ్ధి పొందలేదా? నువ్వున్నంత కాలం కాంట్రాక్టులన్నీ మనవాళ్లకే కదా!"

"నీ మాట ఎప్పుడు కాదన్నాను, డాక్టర్? క్యాంటీన్‌లో సరుకుల దగ్గర్నుంచి, జవాన్ల యూనిఫామ్ దగ్గర్నుంచి, ప్రతీ దాంట్లోనూ – నీకు చెప్పకుండా, నిన్ను కాదని నేనేదీ చేయలేదు. నాది 'కీ పోస్టు' కావడంతో లాభించింది. పైగా ఆ దారిన సంపాదించినది ఖర్చు పెట్టకుండా దాచుకోవడంతో ఎవరికీ అనుమానం తగల్లేదు..."

"...నీకో జోక్ చెప్పనా? మొన్న దల్‌బీర్‌సింగ్ అంటున్నాడు – నీ అంతటి నిజాయితీపరుణ్ని చూడలేదని. నీలాటి వాడు మళ్లీ పుట్టడట! లోపల నాకు ఒకటే నవ్వు! పైకి మాత్రం 'అవునవును, నాకు తెలియదూ, అతని పిల్లలు ఖరీదైన బట్టలు వేసుకోగా ఎప్పుడూ చూడలేదు' అన్నా."

"అదే నా కొంప ముంచింది డాక్టర్. పిల్లలకు నిజాయితీ గురించి లెక్చర్లు ఇచ్చి, ఆడంబర జీవితానికి దూరంగా ఉంచడంతో వాళ్లందరూ అదోరకంగా తయారయ్యేరు. ఇప్పుడు డబ్బు ఉంది అనుభవించండర్రా అంటే వద్దు పొమ్మంటున్నారు."

"వాళ్ల మొహం, మొదట్లో అలానే అంటార్లే. తండ్రి రిటైరై కూచున్నాడు. ఆయన డబ్బంతా మనకే పెట్టేస్తే పాపం ఏం తింటాడని జాలి. వాళ్లకి తెలియదు, వాళ్ల నాన్న రెండు తరాల దాకా తరగని ఆస్తి సంపాదించాడని" అంటూ భళ్లున నవ్వాడు పరాంకుశం.

విక్రమ్ కంగారు పడ్డాడు. "ష్, అంత పెద్దగా అరిస్తావేం? క్లినిక్‌లో వాళ్లు ఎవరైనా వింటే."

"ఏం ఫర్వాలేదు. ఈ టైములో ఎవరూ ఉండరులే. సెక్రటరీ లంచ్‌కి వెళ్లింది. అసలు నేనూ లంచ్‌కి బయల్దేరే వాణ్ని. నువ్వు వచ్చావని ఆగిపోయాను."

"పోన్లే, దయ తలిచావు. ఇంకాస్త దయ దలిచి, నా ఆరోగ్యం బాగుపడిందనీ, నేను డ్యూటీలో చేరవచ్చనీ సర్టిఫికెట్టు ఇచ్చేయ్. పోతాను."

పరాంకుశం భృకుటి ముడిపడింది. "సీరియస్‌గానే మాట్లాడుతున్నావా విక్రమ్? నీకు మంచం మీద నుండి లేవలేనంత జబ్బు వచ్చిందని సర్టిఫికెట్టు ఇచ్చి ఆర్నెల్లు కాలేదు. మళ్లీ డ్యూటీలో చేరనని చెప్పేశావు అప్పుడే. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లన్నీ చేసుకుంటే ఇప్పుడొచ్చి ఇలా..."

"...నేను మాత్రం ఇలా జరుగుతుందని అనుకున్నానా? భార్య ఎలాగూ పోయింది. ఆ డబ్బు పిల్లల సౌఖ్యానికి ఉపయోగపడితే అంతే చాలనుకున్నాను. అందుకే మీ అందరూ వద్దంటున్నా సిక్‌లీవ్ అప్లయి చేసి, ఆ బేసిస్ మీద రిటైరుమెంటుకి అప్లయి చేసాను."

"అది వచ్చే నెలలో శాంక్షనై వచ్చేస్తుంది. ఓపిక పట్టు."

"శాంక్షనూ వద్దు, చట్టుబండలూ వద్దు. నేను రిటైరవదలుచుకోవటం లేదు. డ్యూటీలో మళ్లీ జాయినయిపోతాను. ఇంకో విషయం ఇప్పుడే చెప్పేస్తున్నాను. నన్ను మళ్లీ ఆ రొంపిలోకి దింపకు ఈసారి అందరూ అనుకొనేది నిజం చేస్తాను. ఆనెస్టుగా ఉంటాను."

"అసలు సంగతి చెప్పవయ్యా అంటే నువ్వు ఏదేదో మాట్లాడతావెందుకు? నీకు వచ్చిన కష్టం చెబితే నేను సాల్వ్ చేస్తానుగా"

"దీనిలో చెప్పేందుకేముంది? నేను ఆ విధంగా సంపాదించిన డబ్బు మా వాళ్లకు వద్దు."

"అలా అని నీకు చెప్పారా?"

"చెప్పలేదు. చేతల్లో చూపిస్తున్నారు. మా అమ్మాయంటే నాకు ప్రాణం అని నీకు తెలుసుగా."

"ఆహాఁ! శుబ్బరంగా తెలుసు. ఆమె భర్తది పెద్ద ఉద్యోగం కాదనేగా నీ బాధ! అందుకే వ్యాపారం చేసుకోమని డబ్బు ఇస్తానంటూండేవాడివిగా!"

"అవునా? అప్పుడు సరే, చూద్దాం అనేది కదా? ఇప్పుడు ఉలకటం లేదు, పలకటం లేదు. ఎందుకులే నాన్నా నువ్వు డబ్బివ్వడం? మేం బాగానే ఉన్నాంగా అంటోంది."

"దానికింత బాధెందుందుకు? బాగానే ఉందేమో!" అన్నాడు పరాంకుశం అనునయంగా.

"గాడిదగుడ్డు! నాకు తెలియదనుకున్నావా? వాళ్లింట్లో ఉండేటప్పుడు ఆ మాత్రం అబ్జర్వ్ చేయకుండా ఉంటానా?"

"వాళ్లింట్లో ఎందుకు వెళ్లావ్? మీ అబ్బాయి ఇంట్లోనే కంటిన్యూ కావచ్చుగా!"

"ఏం చెప్పమంటావ్ నా తలరాత! సిక్‌లీవ్ తీసుకుని ఇంట్లో కూచున్న తర్వాత నా దొంగడబ్బులోంచి మా అబ్బాయికి ఇంపోర్టెడ్ కారు కొనిచ్చాను. డబ్బు ఎక్కడిదన్నాడు వాడు. ఫ్రెండు దగ్గర అప్పు తెచ్చానన్నాను. అప్పులు చేయవద్దని నువ్వే మాకు చెప్పేవాడివి కదా, నువ్వే ఎలా చేసావ్? అన్నాడు. నేను ఇరకాటంలో పడ్డాను."

"డాక్టర్ స్కూటర్ మీద తిరగవద్దన్నాడు. అందుకని కొన్నాడని చెప్పలేకపోయావా?"

"అలాగే చెప్పాను. అయినా వాడు నమ్మలేదు. కోడలు పిల్ల కారు చూసి మురిసిపోయి, వాడి నోరు నొక్కేసింది. కానీ వారం తిరక్కుండా దానికి యాక్సిడెంటు కావడంతో అక్కణ్నుంచి పేట్రేగిపోయింది. 'ఎవడి పొట్ట కొట్టి సంపాదించిన సొమ్మో, మాకు కొట్టింది' అంటూ ఒకటే సణుగుడు."

"మీ వాడికేమైనా అయిందా?"

"ఎముకలు విరిగాయి. పదిహేను రోజులు హాస్పటల్లో ఉండాల్సి వచ్చింది. రివర్స్ చేస్తూ సరిగ్గా చూసుకోలేదు. యాక్సిడెంటు ఎవడికైనా కావచ్చు. కానీ ఆ మహాతల్లి నా వల్లనే, నా లంచగొండితనం వల్లనే కారుకి యాక్సిడెంటు అయినట్టు పెద్ద గోల, సూటిపోటి మాటలు. మా అబ్బాయి దగ్గర హాస్పటల్ వాళ్లెవరో అన్నారుట. మనకు తెలియకుండానే చాలామంది శత్రువులు తయారయ్యేరు,

పరాంకుశం!" అన్నాడు విక్రమ్ దిగులుగా.

"అర్థమయ్యింది. కోడలు గారి మీద అలిగి నువ్వు కూతురు పంచన చేరావు. అల్లుడుగారు డబ్బు లేక అవస్థయినా పడతాడు గానీ, నీ పాపిష్టి డబ్బు ముట్టడు. అంతేనా?"

"అక్కడితో ఆగలేదు. మొన్న ఓ హోటల్‌కి వెళ్లాం. పక్క టేబుల్ మీద ఎవరో స్మోక్ చేస్తూ ఉంటే వెళ్లి పేచీ పెట్టుకున్నా. ఓ కుర్రాడు దూకుడుగా ముందుకు వచ్చాడు. ఇంకోడు వాణ్ని ఆపుతూ నా గురించి ఏదో అన్నాడు. నాకు స్పష్టంగా తెలియలేదు. అందర్నీ దోచి సంపాదించిన డబ్బు మదమెక్కిస్తుందనో ఏదో అన్నాడు. ఏమన్నాడో చెప్పమంటే మా అమ్మాయి, అల్లుడు వినలేదంటారు."

"వాడసలు అనలేదేమో! అంతా నీ ఊహనేమో! గిల్ట్ ఫీలింగ్ అవసరానికి మించి ఉన్నా డేంజరే, మై ఫ్రెండ్!"

విక్రమ్ నవ్వలేదు. "వాళ్లు అలా ఊరుకోవడమే నాకు మరింత బాధ కలిగించింది. నాకు తర్వాత గుర్తుకు వచ్చింది. ఆ కుర్రాడు మరెవరో కాదు, మన వాటాలు ఇవ్వనందుకు పగబట్టి ఫ్యాక్టరీ ఒకటి క్లోజ్ చేయించాం చూడు, దానిలో ఫోర్మెన్‌గా చేసేవాడు, వాడు. వాడు కడుపుమంట కొద్దీ ఏదో తీవ్రంగానే అని ఉంటాడు. అందుకే వాణ్ని కొట్టడానికి వెళ్లాను."

"మీ అల్లుడేమంటాడు?"

"ఏమంటాడు? మావగారూ, మీరు రెచ్చిపోకండి. అసలే మీ ఆరోగ్యం మంచిది కాదు అంటాడు. ఈ దొంగ మెడికల్ సర్టిఫికెట్ కాదు కానీ ప్రతీవాడూ నా ఆరోగ్యం గురించి మాట్లాడేవాడే!"

"నువ్వు సైకలాజికల్‌గా డిస్టబ్ అవుతున్నావ్. ఏవేవో ఊహించుకుంటున్నావ్. రిలాక్స్. కొడుకూ వద్దు, కూతురూ వద్దు. హాయిగా ఊటీ వెళ్లిపో. అక్కడ నా గెస్ట్‌హౌస్ ఉంది. అన్ని సౌఖ్యాలు దొరుకుతాయి, ఇన్‌క్లూడింగ్ గాల్స్. హాయిగా ఎంజాయ్ చేయి. వయసు మరీ అంత ముదిరిపోలేదుగా!"

"ఒద్దొద్దు. చేసిన పాపాలు చాలు. నా ఉద్యోగానికి నేను మళ్లీ వచ్చేసి, చేసిన తప్పులు సరిదిద్దుకుంటే అంతే చాలు. ఇకనుండి నిజాయితీగా ఉండదలుచుకున్నాను. ప్లీజ్, నువ్వూ కోపరేట్ చేయాలి. నా జోలికి రానని మాటివ్వాలి. నేను మెడికల్లీ ఫిట్ అని సర్టిఫికెట్ ఇచ్చేయ్. వెళ్లి డ్యూటీలో జాయినయిపోతాను." విక్రమ్ బతిమాలసాగేడు.

పరాంకుశం అతనికేసి దీర్ఘంగా చూస్తూనే ఉండిపోయాడు. కాస్సేపటికి, "విక్రమ్, ఇదే ఫైనలా?" అని అడిగేడు.

"ఫైనలు కాక మరేమిటి? ఎట్టి పరిస్థితుల్లోనూ డ్యూటీలో చేరదామనే నిశ్చయించుకున్నాను. ఒక్క సంఘటనతో తీసుకున్న నిర్ణయం కాదిది. సర్టిఫికెట్ ఇవ్వడం నీదే ఆలస్యం."

పరాంకుశం నిట్టూర్చాడు. "విక్రమ్, యూ ఆర్ చైల్డిష్. ఇష్టం వచ్చినప్పుడు వచ్చి, ఇష్టం వచ్చినప్పుడు పోడానికి ఇది ఆర్మీ అనుకుంటున్నావా? మరోటా?" అన్నాడు మందలిస్తున్నట్టు.

విక్రమ్ తికమకపడ్డాడు. "నేను సిక్‌లీవులోనే కదా ఉన్నది! వాలంటరీ రిటైరుమెంటు కూడా అప్లికేషన్ మాత్రం పంపాను. ఇంకా శాంక్షన్ కానే లేదు. నేను చేరడానికి అభ్యంతరం ఏమిటి?"

"అభ్యంతరం ఏమిటంటే నువ్వు మంచం మీద నుండి కదిలే పరిస్థితిలో లేవని, సిక్‌లీవ్ పొడిగించాలని అప్లికేషన్ వెళ్లడం, నేను సర్టిఫికెట్ ఇవ్వడం, నిన్ను పరీక్షించిన తర్వాత నా సర్టిఫికెట్‌తో ఏకీభవిస్తున్నట్టు ఓ టీమ్ ఆఫ్ డాక్టర్స్ రాసి ఇవ్వడం - అన్నీ జరిగిపోయేయి కనక!" పరాంకుశం అతి నిబ్బరంగా, నిశ్చలంగా చెప్పాడు.

విక్రమ్ మతిపోయింది. "అన్యాయం! ఇదంతా నన్ను అడక్కుండానే జరిగిపోయిందా? అంటే ఆ టీములో డాక్టర్లనందరినీ కూడా కొనేసేవన్నమాట! మై గాడ్ పరాంకుశం! నువ్వు ఎంతకైనా తగుదువు. అయినా నా ప్రమేయం లేకుండా, నా సంతకం కూడా ఫోర్జ్ చేసేసి..."

చిన్నపిల్లవాడి చేష్టలు చూసి నవ్వినట్టు పరాంకుశం పడిపడి నవ్వాడు. ఆ తర్వాత గీతోపదేశం చేసే పోజు పెట్టి, "విక్రమ్ నేను, నేను అంటూ పెద్దగా అరుస్తావెందుకు? నువ్వు కేవలం పాత్రధారివి.

సూత్రధారిని నేను. నేను చెప్పినట్టు అందరూ నడుస్తారు. ఆ డాక్టర్లే కాదు, కాంట్రాక్టర్లే కాదు, బిల్లులు పాస్ చేసే పై వాళ్లే కాదు. అందరూ నేను చెప్పినట్టు నడవాల్సిన వాళ్లే! నువ్వే కాదు, నీ స్థానంలో వచ్చిన మేజర్ నాయర్ కూడా! ఇక నువ్వు మారాం విడిచిపెట్టి ఇంటికో, ఊటికో వెళ్లిపో. నాకు ఆకలి వేస్తోంది. ఇంటికెళ్లి భోజనం చేయాలి" అంటూ లేవబోయాడు.

విక్రమ్ మొహం బిగుసుకుంది. "యూ స్కౌండ్రల్! నీలాటి విషప్పురుగు వల్లనే మాలాటి వాళ్లం చెడుతున్నాం. నేను నాయర్‌ను హెచ్చరిస్తాను." అన్నాడు తర్జని చూపిస్తూ.

పరాంకుశం తొణకలేదు. "మాట్లాడతావా? ఇదిగో ఫోన్. చెయ్. నా ఆఫీసు నుండి మాట్లాడుతున్నానంటే అతను భయపడతాడని అనుకుంటున్నావా? ఇంటినుండే, సిక్‌బెడ్ నుండి మాట్లాడుతున్నానని చెప్పు. ఏం నష్టం లేదు."

విక్రమ్ నాయర్‌కు తన కథ అంతా చెప్పుకొచ్చాడు. పిల్లలు తనను ఎలా చిన్నచూపు చూస్తున్నదీ చెప్పాడు. తనకు డ్యూటీలో చేరే ఉద్దేశ్యం లేదనీ, అయినా ఒక సీనియర్‌గా, పాత కొలీగ్‌గా పరాంకుశం లాటి వాళ్లకు దూరంగా ఉండమని హెచ్చరిస్తున్నానన్నాడు. వేరేలా సంపాదించిన డబ్బు అచ్చిరాదనీ, అనుభవించడానికి కూడా పనికిరాదనీ నచ్చచెప్పాడు.

నాయర్ వినలేదు. "వృద్ధనారీ పతివ్రతా అని మీరిప్పుడు ఎన్నయినా నీతులు చెప్తారు సార్! మీ కడుపు నిండింది కాబట్టి మమ్మల్ని పస్తులుండమంటారు. ఇన్నాళ్లు మీ గుట్టు బయటపడకుండా కాపాడినందుకు మీరు డాక్టరు పరాంకుశం గారికి ఋణపడి ఉండాలి కానీ ఆయన మీద నిందలు వేయకూడదు. మీ స్థానంలోకి వచ్చేదాకా మీ గురించి పూర్తిగా తెలియనంత ఇదిగా ఆయన సీక్రసీ మేన్‌టేన్ చేసాడంటే హీ ఈజ్ గ్రేట్!" అన్నాడు.

విక్రమ్ ఇక వినలేకపోయాడు. తల దించుకుని పరాంకుశం కేసి చూడలేకపోతూ ఉంటే పరాంకుశమే పలకరించాడు. "నేను చెప్పలేదా? నా పాత్రలన్నీ నేను చెప్పినట్టే ఆడతాయి, మాట్లాడతాయి. ఇప్పుడు నీ పాత్ర నిష్క్రమించాలని ఈ సూత్రధారి ఆజ్ఞాపిస్తున్నాడు. చడీ చప్పుడూ కాకుండా వెళ్లిపో. ఎవరైనా చూసేలోపునే వెళ్లిపో. ఇక ఎప్పుడూ డ్యూటీలో చేరే ఆలోచన చేయకు. నీతో నా అవసరం తీరిపోయింది. ఇవాళ నాయర్, రేపు మరో హర్‌బన్స్, ఎల్లుండి బెనర్జీ...నా ఆట సాగుతూనే ఉంటుంది. చదరంగంలో చచ్చిపోయిన పావును తీసి పక్కన పడేస్తారు. నీ స్థితి అంతే! తెలుసుకుని దానికి తగ్గట్టు నడుచుకో!" అతని గొంతులో పలుకుతున్న ఆజ్ఞ విక్రమ్‌ను మండించింది.

రెండో నిమిషంలోనే తేరుకున్నాడు. మొహంలో కనబడే కోపాన్ని, ఉక్రోషాన్ని అదుపు చేసుకున్నాడు. తలయెత్తి, "డాక్టర్! నీకు తెలుసా! ఒక్కోప్పుడు సూత్రధారికీ పాత్ర ఉంటుంది! అలాగ నీకూ ఓ పాత్ర ఇస్తున్నాను."

"నాకే పాత్ర ఇస్తావ్?" హేళనగా అడిగేడు పరాంకుశం.

"హంతకుడికి సహాయపడే పాత్ర!"

"అంటే?"

"అంటే ఓ హంతకుడికి దొంగ మెడికల్ సర్టిఫికెట్టు ద్వారా సహాయపడే డాక్టర్ పాత్ర అన్నమాట. నాయకుడు ఒక హత్య చేస్తాడు. కానీ అతను మంచంలో నుండి కదలలేని పరిస్థితిలో ఉన్నాడని తను సర్టిఫికెట్టు ఇవ్వడమే కాక, తక్కిన పెద్ద, పెద్ద డాక్టర్లందరి చేతా సర్టిఫై కూడా చేసి ఇస్తాడు. వాటి ఆధారంగా నాయకుడి మీద అనుమానం రానే రాదు. కేసు పెట్టినా నిలవదు."

పరాంకుశం మొహం పాలిపోయింది. "ఏయ్ విక్రమ్! నువ్వు వెళ్లి ఆ ఫ్యాక్టరీ ఫోర్‌మన్‌ను చంపుతావా? డోంట్ బీ ఫూలిష్."

"వాణ్ని చంపితే ఫూల్‌నే! చంపాల్సింది నీ లాటి చీడపురుగులనూ, సమాజంలో అవినీతి క్యాన్సర్‌ను వ్యాప్తి చేసే కీటకాలనూ..." అంటూ విక్రమ్ కుర్చీలోంచి లేచాడు.

మరో ఐదు నిమిషాల్లో డాక్టర్ పరాంకుశం ఆత్మ పరలోకానికి చేరింది.